రోడ్లు ఇలా...ప్రయాణం సాగేదెలా?

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- గంతలతో ఇబ్బందిగా మారిన రాకపోకలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు


గుంతల మయమైన నందికొట్కూరు రహదారి


బ్రాహ్మణపల్లె రోడ్డులో ఏర్పడిన గుంతలు


ఉప్పలపాడుకు వెళ్లే దారిలో కంకరతేలిన దృశ్యం

ఓర్వకల్లు: గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు వాహనచోదకులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, భారీ వాహనాల తాకిడికి మండలంలో ప్రధాన రహదారులు గుంతలమయం అయ్యాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓర్వకల్లు మండలంలో 22 పంచాయతీలు ఉండగా మూడు మజరా గ్రామాలు ఉన్నాయి. ఎక్కువ శాతం రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధానంగా ఓర్వకల్లు, కేతవరం, ఉప్పలపాడు, తిప్పాయపల్లె, బైరాపురం గ్రామాలకు వేసిన రహదారులు గుంతల మయంగా మారాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. ఒక్కోసారి గుంతలను తప్పించబోయి ఎదురెదురు వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు లేకపోలేదు. భారీ వాహనాల రాకపోకలను అరికట్టాల్సిన రవాణాశాఖ అధికారులు గ్రామీణ రోడ్ల భద్రతను గాలికొదిలేశారు. ప్రతి ఏడాది వాహనదారుల నుంచి రహదారి రుసుం కింద రూ.లక్షల్లో వసూళ్లు చేస్తుంటారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఓర్వకల్లు నుంచి మిడుతూరు వెళ్లే రహదారిలో కన్నమడకల– చౌట్కూరు మధ్య ఐదేళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో అస్తవ్యస్తంగా మారింది. ఈ రహదారిలో వెంకటాపురం, సోమయాజలపల్లె ప్రాంతాల నుంచి కంకర, చిప్స్, ఎర్రమట్టిని మిడుతూరు, నందికొట్కూరు ప్రాంతాలకు తరలిస్తారు. భారీ వాహనాలు, ట్రాక్టర్ల సామర్థ్యానికి మించిన బరవును తరలించడంతో రోడ్డుపై గుంతలు ఏర్పాడ్డాయి. రాత్రివేళల్లో ప్రయాణించడానికి ప్రజలు జంకుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. వర్షపునీటితో నిండిన గుంతలను గుర్తించలేక వాహనచోదకులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు కూడా.
- మండల కేంద్రం ఓర్వకల్లు నుంచి తిప్పాయపల్లె మీదుగా బ్రాహ్మణపల్లె, శకునాలకు వెళ్లే ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. ఆయా గ్రామాలకు నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో అధిక శాతం ప్రజలు ఆటోలలోనే ప్రయాణం సాగిస్తుంటారు. ప్రస్తుత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల రోడ్డుపై గుంతలు ఏర్పాడ్డాయి. వాహన చోదకులు సాఫీగా గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది.
- గార్గేయపురం నుంచి కేతవరం, లొద్దిపల్లె నుంచి బైరాపురం, హుసేనాపురం నుంచి కొంతలపాడు, ఉప్పలపాడు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో భయపడుతూ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఆయా మార్గాలలో బస్సు సౌకర్యం లేక ఆటోలే శరణ్యం. ప్రస్తుత వర్షాలకు రహదారులు దెబ్బతినడంతో ఆటో ప్రయాణాలు తగ్గిపోయాయి. కేవలం ద్విచక్రవాహనాల రాకపోకలకు మాత్రమే అనుకూలంగా ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో డ్రైవర్లు అడిగినంత చెల్లించి ఆటోలలో వెళ్లాల్సిన పరిస్థితి. ఇందులో గార్గేయపురం నుంచి కేతవరం, పూడిచెర్ల గ్రామాలకు ఆటోలు కూడా అంతంతమాత్రమే. ఆయా గ్రామాల ప్రజలు కేవలం బైక్‌లపై ప్రయాణించక తప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లతో బీటీ రోడ్లు

ఓర్వకల్లు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. ప్రాధాన్యత మేరకు రోడ్ల నిర్మాణం చేపట్టింది. ఓర్వకల్లు మండలంలో రూ.2 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణం జరిగింది. ఇందులో సోమయాజులపల్లె నుంచి కొమరోలు వరకు రూ.60 లక్షలు పంచాయతీ రాజ్ నిధులతో 4 కిమీ మేర బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. అదేవిధంగా ఎన్ కొంతలపాడు నుంచి ఉప్పలపాడు రోడ్డు వరకు రూ.20 లక్షలతో కనెక్టివిటీ రోడ్డు నిర్మాణం జరిగింది. కాల్వబుగ్గ నుంచి పాలకొలను మీదుగా చింతలపల్లె వరకు రూ.1.20 కోట్లతో 8 కిమీ మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మండల కేంద్రం ఓర్వకల్లులో మర్రిచెట్టు నుంచి కిలోమీటర్ మేర రూ.40లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా దాదాపు ప్రతి గ్రామంలో ప్రాధాన్యత మేరకు సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది.

హైవే ... అధ్వానం!


ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల వద్ద దెబ్బతిన్న రోడ్డు

పాణ్యం: హైవే అధ్వానంగా మారింది. ప్రత్యేకించి అధికారులు నిర్లక్ష్యంతో హైవే సర్వీస్ రోడ్లు శిథిలమయ్యాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం చిన్న పాటి వర్షాలకే పూర్తిగా దెబ్బతినిపోతున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని బలపనూరు మెట్ట వద్ద సర్వీస్ రోడ్డుపై గుంతులు ఏర్పడ్డాయి. అలాగే ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల వద్ద నాలుగురోడ్ల కూడలిలో భారీ గుంతలు పడ్డాయి. ఇక్కడ నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అలాగే ఇక్కడే పీయూపీ (పబ్లిక్ అండర్ పాస్) కింద అధ్వానంగా ఉంది.

- పాణ్యం చెంచుల కాలనీ వద్ద పాణ్యంలోకి వచ్చే సర్వీస్ రోడ్డు మొదలుకొని ముగిసే వరకు రోడ్డు వెంట గుంతలు ఏర్పాడ్డాయి. ఇటీవల గుంతల కారణంగా ఓ భారీ వాహనం చక్రాలు విరిగిపడ్డాయి.
- మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న పీయూపీ రోడ్డు కంటే తగ్గులో ఉండడంతో వర్షపునీటితో అపరిశుభ్రత నెలకొంది. రాకపోకలు సాగించలేని పరిస్థితి. నీటి నిల్వతో దుర్వాసన వెదజల్లుతోంది.
- పాణ్యం బస్టాండ్‌లోని వీయూపీ (వెహికల్ అండర్‌పాస్)వద్ద కూడా నిత్యం వర్షపునీటి బురద మయంగా మారింది. చిన్న పాటి వర్షానికే బ్రిడ్జి కింద నీరు చేరుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సర్వీస్ రోడ్లకు ఇరువైపులా చేపట్టిన కాల్వల నిర్మాణం మధ్యలోనే ఆపేశారు.
- దర్గా వద్ద సర్వీస్ రోడ్డు ప్రారంభం నుంచి బస్టాంగ్ వరకు పూర్తిగా దెబ్బతినింది. పక్కనే ఉన్న పీయూపీ అనుకుని కేబుల్ కోసం వేసిన కాంక్రీట్ కల్వర్టును గమనించని వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.


పాణ్యం చెంచుకాలనీ వద్ద దెబ్బతిన్న సర్వీస్ రోడ్డు

క్లుప్తంగా

చెత్త సేకరణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి


చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామాలలో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఈఓఆర్డీ సందీప్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. తుంగభద్ర నదీతీరం సమీపాన నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 12 చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. గ్రామాలలోని చెత్తను తరలించి, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

28న పట్టుబడిన వాహనాల వేలం


సెబ్ ఆధ్వర్యంలో పట్టుబడ్డ వాహనాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలను ఈనెల 28న సెబ్ సూపరింటెండెంట్ రవి కుమార్ ఆధ్వర్యంలో వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించే వాహనాల వేలం పాటలో ఆసక్తి వ్యక్తులు పాల్గొని వాహనాలు పొందవచ్చునని సీఐ వివరించారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిన్నటేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎంపీడీఓ మాట్లాడారు. బోధన, మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఎంపీడీఓ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి చిన్న లచ్చప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా


సి.బెళగల్ సమీపంలో బోల్తాపడిన ఎరువుల బస్తాల లారీ

సి.బెళగల్: కర్నూలు నుంచి సి.బెళగల్ 280 యూరియా ఎరువు బస్తాలను సి.బెళగల్‌కు తీసుకొస్తున్న లారీ (నంబర్ ఏపీ21టీ6111) మంగళవారం అదుపు తప్పి బోల్తా పడింది. సి.బెళగల్ సమీపంలో ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను తప్పించబోవడంతో అదుపు తప్పినట్లు లారీ డ్రైవర్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. లారీలో డ్రైవర్ మాత్రమే ఉండగా, ఎలాంటి గాయాలు తగలకుండా బయటపడ్డాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపాడు.

బడుగు బలహీన వర్గాల బడ్జెట్


సమావేశంలో మాట్లాడుతున్న తారకేశ్వరుడు

కల్లూరు: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారాం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి, బలహీన వర్గాల బడ్జెట్ అని బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు తారకేశ్వరుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాణ్యం నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంతో పాటు, కర్నూలు నుంచి బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు నిధులు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఓర్వకల్లు పరిశ్రమ కేంద్రానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరప్ప, మదనమోహన్ ఆచారి, కోనేటి వేణు యాదవ్, వీరమ్మ, రవికుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

వెలుగోడు : వెలుగోడు మండలానికి చెందిన నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు మంగళవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. గుంతకందాల, రేగడగూడూరు, అబ్దుల్లాపురం, మోతుకూరు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా తమ రాజీనామా పత్రాలు అందజేశారని ఎంపీడీఓ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు


సంగాలలో స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం మన్నెగుంట హంద్రీ నది నుంచి మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సెబ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేల చొప్పున రూ.20వేలు జరిమానా విధించినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు చెప్పారు. హంద్రీనది నుంచి ఎవ్వరూ ఇసుకను తరలించరాదని, అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. దాడుల్లో కోడుమూరు సెబ్ ఎస్ఐ ఆలీబేగ్, సిబ్బంది హనుమంతు, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంగాల గ్రామంలో....

సి.బెళగల్: మండల పరిధిలోని సంగాల గ్రామంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి పోలీసులు గస్తీ నిర్వహించారు. సంగాల గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక టాక్టర్లను పట్టుకున్నామన్నారు. సంగాల గ్రామానికి చెందిన యువరాజు, శేఖర్, ముడుమాల గ్రామాని చెందిన వడ్డె అనంత్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

వేతన జీవులను నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్


సమావేశంలో మాట్లాడుతున్న నగిరి శ్రీనివాసులు

గడివేముల: కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ వేతన జీవులను నిరాశపరిచిందని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి, విమర్శించారు. మంగళవారం గడిగరేవులలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడారు. పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం మూలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆందోళనలు చేస్తుంటే బడ్జెట్‌లో పాత పెన్షన్ ప్రస్తావన లేకపోవడం చాలా బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ గడివేముల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాపరెడ్డి, బాలస్వామి, జిల్లా మహిళా కార్యదర్శి కవిత, నాయకులు నాగన్న, మహబూబ్ బాషా, రాంపుల్లారెడ్డి, మారెన్న, శ్రీరాములు, చంద్రశేఖర్ ఆచారి పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి


మురుగునీటి కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సునీత

కోడుమూరు రూరల్: అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని గూడూరు ఎంపీపీ సునీత సూచించారు. మంగళవారం గూడూరు మండలం చనుగొండ్ల మజారా గ్రామం వై.ఖానాపురంలో మండల నిధులతో నిర్మిస్తున్న మురుగునీటి కాల్వల నిర్మాణాలను ఎంపీపీ పరిశీలించారు. పనులపై కాంట్రాక్టర్‌తో చర్చించారు. నాణ్యతతో పాటు నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తి చేయాలని ఎంపీపీ సూచించారు. నిర్మాణ పనుల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ వెంట ఎంపీటీసీ బోయ రంగయ్య, వార్డు మెంబర్ రంగయ్య ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రంగస్వామి

కోడుమూరు రూరల్: హాస్టల్ విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కోడుమూరులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో కాస్మోటిక్ చార్జీలను చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్లు తెరచి నెల రోజులైనా హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు, ట్రంకు పెట్టెలను కూడా అందజేయలేదని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అల్తాఫ్, సిద్ధు, బాషా తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన పెద్దమ్మ ఆలయం

గడివేముల: స్థానిక మూలపెద్దమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలు చేశారు.

ఆధార్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోండి

పాణ్యం: ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ సూచించారు. మంగళవారం తమ్మరాజుపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్‌ను ఆమె తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 27తేదీ వరకు ఈ క్యాంప్‌లు కొనసాగుతాయన్నారు. అలాగే తమ్మరాజుపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. పాలు, ఇతర ఆమర ప్యాకేట్లను పరిశీలించారు. రిజిస్ట్రార్‌లు తనిఖీచేసి పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

కల్లూరు: వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటిస్తు వ్యాధులు దూరమవుతయాని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బస్తిపాడు, చిన్నటేకూరు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలకుండా డ్రైనేజీ కాలువలను ఏప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతనం తడకనపల్లె, బస్తిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఆధార్ క్యాంపులను పరిశీలించారు. అనంతరం బస్తిపాడు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపిసి (చెత్త నుంచి సంపద కేంద్రాన్ని) పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓ మద్వేశ్వరమ్మ, ఈసీ మధుసూదన్‌రావు, తడకనపల్లె సర్పంచ్ సహేరబీ, పంచాయతీ కార్యదర్శులు చిన్న లచ్చప్ప, బిందు భార్గవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పూర్తి సౌకర్యాలు

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు, విద్యాభ్యాసానికి అవసరమైన సౌకర్యాలు ఉన్నాయని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. మండల పరిధిలోని సంగాలలో న్యూ అండ్ ఓల్డ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీఓ పర్యవేక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ విద్యా విధానంతో పాఠ్యాంశాల బోధనను ప్రభుత్వాలు తీసుకరావడం జరిగిందన్నారు.

గోరుకల్లులో పశువైద్య శిబిరం

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ తరుపున మంగళవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ పార్థసారథిరెడ్డితోపాటు సర్పంచ్ ఉసేన్‌బాషా హాజరయ్యారు. 45పశువులకు గర్భకోశవ్యాధి నివారణకు వైద్యులు టీకాలు వేశారు. పాడి ప్రయోజనాలను పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ పార్థసారథిరెడ్డి రైతులకు వివరించారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా పచ్చిక బయళ్లు ఆక్రమణ


సి.బెళగల్లోని పశువులు మేపేందుకు ఉన్న పచ్చిక బయలను ట్రాక్టర్‌తో దున్నుతున్న దృశ్యం

సి.బెళగల్: పచ్చిక బయళ్లను సైతం అక్రమార్కులు వదలడంలేదు. పశువుల మేపు కోసం ఉన్న కొండ ప్రాంతాలను అక్రమార్కులు కొంతకాలంగా ఆక్రమించుకుని పంటలను సాగు చేసుకుంటున్నారు. విషయంపై స్థానిక గొర్రెలు, మేకల యజమానులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పచ్చిక బయళ్లలో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు సైతం జారీ చేసింది. అయితే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణలు సాగిస్తూనే ఉన్నారు. టాక్టర్లతో కొండలను చదును చేసుకుని సాగు చేస్తున్నారు. ఆక్రమణలపై తహసీల్దార్, పోలీస్, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి సంరక్షణ చర్యలు తీసుకోవడం లేదని గొర్రెలు యజమానులు ఆరోపిస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని గొర్రెలు యజమానులు వాపోతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

ఓర్వకల్లు: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతతపై అవగాహన కల్పించాలని జిల్లా బాల స్వస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత సూచించారు. మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆమె సీజనల్ వ్యాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. పిల్లల్లో విరేచనాలు, వాంతులు, కడుపునొప్పి తదితర లక్షణాలు ఉంటే అతిసార వ్యాధిగా అనుమానించాల్సి ఉంటుందన్నారు. కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం మూలంగా అతిసార సోకే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, మంగమ్మ, ప్రాజెక్ట్ నిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీడీ శ్యామల

సి.బెళగల్: ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. మంగళవారం ఆమె యూనిట్ మలేరియా అధికారి రంగస్వామి, మండల అధికారులతో కలిసి పోలకల్, బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల పరిశుభ్రత, సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు వ్యాప్తి, వ్యాధుల నివారణ, ఆరోగ్య జాగ్రత్తలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వృద్ధుడి మృతి

పాణ్యం : మండల పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన వృద్ధుడు ఉప్పరి నాగప్ప(73) షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్ మంగళవారం తెలిపారు. నాగప్ప పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లారని, పొలాల గట్ల మధ్యలో విద్యుత్ వైర్లు గమనించని వృద్ధుడు కొడవలి వైర్లకు తగిలి కింద పడ్డాడు. గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లగా చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మధుసుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇదో రకం ప్రమాద హెచ్చరిక!



కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వెళ్లే రోడ్డులో రామన్ హైస్కూల్ ఎదుట వర్షాలకు నీరు నిలిచి రోడ్డుపై అడుగుకు పైగా గుంతలేర్పడ్డాయి. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో కొంత మంది వాహనదారులు గుంతలను గమనించకుండా వెళ్లి ప్రమాదాల భారిన పడుతున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాన్ని పసిగట్టేందుకు గుంత ఉన్న ప్రాంతంలో స్థానికులు ఎండిన ఓ చెట్టు కొమ్మను అడ్డుగా ఉంచారు. దీంతో వాహనచోదకులు గుంగపక్కన వెళ్తున్నారు. ఇదో రకమైన ప్రమాద హెచ్చరిక అంటూ బాటసారులు చర్చించుకుంటున్నారు.

– కోడుమూరు రూరల్